వైద్యో వ్యాపారం హరీ..

- సీజనల్ ఫీవర్లతో సతమతమవుతున్న ప్రజలు
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో అందని వైద్యం
- ఆర్‌ఎంపీల దగ్గరకు వెళ్లారా.. అంతే !
- అవసరం లేకున్నా..2 ఇంజెక్షన్లు, 3 మాత్రలు, టెస్ట్‌లు చేయించుకోండని సలహా
- ఆపై ప్రైవేట్ ఆస్పత్రులకు పంపితే మంచి కమీషన్
- ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని జలగల్లా రక్తం పీల్చేస్తున్న ఆర్‌ఎంపీలు
- పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



పూతలపట్టు మండలానికి చెందిన ఓ మహిళకు జ్వరం వస్తుండడంతో చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి వెళ్లింది. అక్కడి ఆర్‌ఎంపీ ఇంజెక్షన్ ఇచ్చి, రెండురోజులకు సరిపడా మందులు, మాత్రలు ఇచ్చి పంపారు. ఫీజు మొత్తం రూ.500 తీసుకున్నాడు. మూడు రోజులైనా జ్వరం తగ్గలేదని ఆమె మళ్లీ క్లినిక్‌కు వెళ్లింది. అతను రక్తపరీక్షలు చేయించుకురావాలని చీటీ రాసి ఇచ్చి పంపాడు. అక్కడ రక్తపరీక్షల అనంతరం ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయి. ఇక్కడే ఉంటే ప్రాణానికే ప్రమాదం అని చిత్తూరు నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి రెఫర్ చేశాడు. అక్కడ ఐదు రోజులు చికిత్స తీసుకోగా, మొత్తం రూ.50 వేలు బిల్లు అయింది. అందులో కొంత ఆర్‌ఎంపీకి కమీషన్ ముట్టినట్లు సమాచారం. ఇలా కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాహకులు కొందరు ఆర్‌ఎంపీలకు కమీషన్ ఇచ్చి, కేసులు రాబట్టుకుంటున్నట్లు చర్చ సాగుతోంది.


చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని కార్పొరేట్ ఆస్పత్రులకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు మధ్య మంచి వ్యాపారం నడుస్తోంది. ఆర్‌ఎంపీలకు దగ్గరకు ఎవరు ఏ రోగంతో వెళ్లినా కూడా వెనుకాముందు ఆలోచించకుండా రెండు ఇంజెక్షన్లు, మూడు రకాల మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. అమాయలను అనుకూలంగా ఉన్న ఆస్పత్రికి రెఫర్ చేయడం ఫీజులో కమీషన్ అందుకునే దందా భారీగా నడుస్తోంది. రెఫర్ చేస్తే క్లినిక్‌లకు కాసులు కురిపిస్తున్నాయి. అర్హత లేని వారు నకిలీ ఆర్‌ఎంపీ అవతారం ఎత్తి..రోగులను రెఫరల్ చేస్తున్నారు. ఈదందా పలు క్లినిక్‌ల నుంచి కార్పొరేట్‌కు పాతుకుపోయింది. ప్రజారక్తాన్ని పీల్చి.. క్లినిక్‌లకు వండి పెడుతున్నారు. అనుమతి లేని క్లినిక్‌లను అడ్డాగా మార్చుకుని దందాకు తెరలేపారు. ఈ దందా ఎప్పటి నుంచో నడుస్తున్నా .. ఈవిషయం ఉన్నతాధికారులకు తెలిసినా గట్టి నియంత్రణా చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రం హడావుడి చేసి.. ఆపై తూతూమంత్రపు చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

సరిహద్దులో ఉండడంతో నయా దందా..

తమిళనాడు, కర్ణాటక సరిహద్దున ఉన్న చిత్తూరు, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో ఈ రెఫరల్ దందా అధికంగా సాగుతోంది. వైద్యాన్ని వ్యాపరంగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీల వద్దకు వచ్చే రోగుల తీవ్రతను బట్టి రెఫర్ చేయాల్సి వస్తే తమ ఆస్పత్రికే పంపాలని కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు ఒప్పందం చేసుకుంటున్నారు. రోగి చెల్లించే మొత్తంలో కమీషన్ రూపంలో కొంత ముట్టజెపుతున్నట్టు వినికిడి.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ క్లినిక్‌లు

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చిత్తూరులో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో బంగారుపాళ్యం మండలంలో సీహెచ్‌సీలు, గుడిపాల, చిత్తూరు, యాదమరి మండలాల్లో పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇక చిత్తూరు నగరంలో అర్బన్ హెల్త్ సెంటర్లు కూడా ఉన్నాయి. వీటి ద్వారా రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అయినా గ్రామాలు, పట్టణాల్లో అదనంగా మరో 250కు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు వెలిశాయి. ఒకప్పుడు వైద్యం కేవలం ఎంబీబీఎస్, ఎండీ ఇలా ఆపై ఉన్నత చదువులు చదివిన వారు మాత్రమే క్లినిక్‌లు పెట్టుకుని రోగులకు వైద్యం చేసేవారు. పదేళ్లగా ఇది వ్యాపారంగా మారింది. ముగ్గురు, నలుగురు కలిసి ఈ దందా కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ భవనాలను అద్దెకు తీసుకుని ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ఇంకొందరైతే ఎలాంటి అనుభవం లేకున్నా ఎంబీబీఎస్ తరహా వీల్‌చైర్లు ఏర్పాటు చేసుకుని, వైద్యుల్లా చెలామణి అవుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకనే హోర్డింగులు, నేమ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల దొంగగా స్కానింగ్ చేస్తూ...అబార్షన్లు చేయిస్తున్న ఓ ముఠాను పట్టుకున్నారు. అధికారులు స్పందించి ఈ అక్రమ క్లినిక్‌లపై కొరడా ఝులిపిస్తే..అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు భావిస్తున్నారు.



ఫిర్యాదు చేస్తే చర్యలు తప్పవు



ఆర్‌ఎంపీలు ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందించాలి. రోగ తీవ్రతను బట్టి ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలి. ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేసినట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా నిర్వహించే క్లినిక్‌లు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడుతాం. చర్యలు తీసుకుంటాం. అనుభవం లేని వారు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే మాత్రం క్రిమినల్ చర్యలు చేపడతాం.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

శానిటేషన్ కార్మికులకు వేతనాలు పెంచాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శనివారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు సమావేశ ప్రాధాన్యతను అజెండా అంశాలను కార్మికులకు వివరించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.నాగరాజు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి.కోదండయ్య మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు రాకపోవడం చాలా బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఆలోచించి ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమావేశంలో నాయకులు వీసీ గోపీనాథ్, రమాదేవి, రాజారాం, కార్మికులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.1.25 లక్షల విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామికి దేవస్థానానికి ఓ దాత రూ.1.25 లక్షలు విరాళంగా ఇచ్చుకున్నారు. తిరుపతికి చెందిన ఉమాపతిరెడ్డి విరాళ నగదును ఆలయ ఏఈఓ రవీంద్ర బాబుకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు కల్పించారు.

క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.3,98,095 ఆదాయం వచ్చినట్లు ఈఓ మునిరాజు తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో హుండీ కానుకలను చిత్తూరు దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ శ్వేత పర్యవేక్షణలో లెక్కించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాధారణ హుండీలకు సంబంధించి 90 రోజులకు గానూ కానుకలను లెక్కించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



రేషన్‌కార్డుల పంపిణీలో తహసీల్దార్ శ్రీనివాసులు

గుడిపాల: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పశుమంద గ్రామంలో ఆయన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ కార్డులు ఇచ్చేటప్పుడు బయోమెట్రిక్ తప్పకుండా తీసుకోవాలన్నారు. రేషన్ పంపిణీలో ఎక్కడా కూడా అవినీతికి తావు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లపై ఉందన్నారు. 49 రేషన్ షాపుల ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

గర్భిణులకు వైద్యచికిత్సలు



గుడిపాల: చింతగుంటూరులో ఆరోగ్యసేవలు అందజేస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతినెలా క్రమం తప్పకుండా చికిత్సలు చేసుకోవాలని వైద్యాధికారి రష్మిత కోరారు. చింతగుంటూరు గ్రామంలో శనివారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులకు 14 రకాల రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులకు ఉచితంగా చికిత్సలు చేసి అన్ని వ్యాధులకు మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా చక్కెరవ్యాధి, రక్తపోటు గలవారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రియాంక, కలైవాణి, వనజ, కోకిలలు పాల్గొన్నారు.

కట్టమంచిలో నిమజ్జనం



క్రేన్ సాయంతో ప్రతిమను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో వినాయకచవితి సంబరాలు మిన్నంటుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన గణనాథులు విశేషపూజలు అందుకుంటున్నారు. చవితి ప్రారంభం మొదలు మూడో రోజు నుంచి నిమజ్జన కార్యక్రమాలు వాడవాడలా అట్టహాసంగా సాగుతున్నాయి. శుక్రవారం అంతంత మాత్రంగానే నిమజ్జనాలు జరిగాయి. గురువారం ప్రతిష్టించిన నిర్వాహకులు శనివారం నిమజ్జనం పూర్తి చేశారు. కట్టమంచిలో నిమజ్జనం చేసి వేడుకున్నారు. కాగా ఆదివారం జోరుగా వినాయక నిమజ్జనం ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడిస్తున్నారు. ఇందుకు తగ్గట్టు చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు.

లడ్డూ వేలం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని పాతతాలూకా వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ ప్రసాదానికి శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు వేలం నిర్వహించారు. మార్వాడీ సంఘం సభ్యులు రూ.13 వేలకు పాడుకుని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, మాజీ వైస్ ఎంపీపీ హిమకర్‌రాజా, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఉపసర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రంలో టీవీ, మోటారు చోరీ



రైతుసేవా కేంద్రం తలుపులు పగులగొట్టిన దృశ్యం

గుడిపాల: మండలంలోని కమ్మతిమ్మాపల్లె రైతు సేవా కేంద్రంలో టీవీ, మోటారు చోరీ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కమ్మతిమ్మాపల్లె రైతుసేవా కేంద్రంలో రైతులకు పంటసాగు మెళకువలు నేర్పడానికి ఓ టీవీ ఏర్పాటు చేశారు. ఈ టీవీని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సేవా కేంద్రం తలుపులు పగులగొట్టి చోరీ చేశారు. అలాగే కేంద్రంలోని ఒన్ హెచ్‌పీ మోటారును కూడా చోరీ చేశారు. వ్యవసాయశాఖ అగ్రికల్చర్ అసిస్టెంట్ దీపక్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మాతృభాష తెలుగును కాపాడుకుందాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని తేనెబండలో శనివారం నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు కరణం విమల ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు, కథా రచయిత సీఎస్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. మన తెలుగు భాష దేశభాషలందు ఎంతో గొప్పదని, అలాంటి మాతృభాషను మరిచిపోకుండా కాపాడుకోవాలని కోరారు. అనంతరం అధ్యక్షురాలు కరణం విమల మాట్లాడుతూ రచయితలను ప్రోత్సహిస్తూ పలు సేవా కార్యక్రమాలను సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీ ప్రియులు రవిచంద్ర, రాణి, పాడి రమేష్ బాబు,కరణం కుమార్,చంద్రకళ, విద్యార్థులు పలువురు సాహితీవేత్తలు, రచయితలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



సాహితీ ప్రియులను సన్మానిస్తున్న నిరావహకులు

అదుపులోకి అతిసారం

- అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో అతిసారం అదుపులోకి వచ్చిందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. జి.గొల్లపల్లెలో కలుషిత ఆహారం తినడంతో అతిసారం విజృంభించిన విషయం విదితమే. రెండవ రోజు శనివారం జి.గొల్లపల్లె వైద్య శిబిరం కొనసాగుతోంది. వైద్య శిబిరంలో 34 మందికి వైద్య సేవలందించారు. అతిసారతో బాధపడుతున్న పరిస్థితి అదుపులోకి వచ్చింది. అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డీఐఓ డాక్టర్ హనుమంతురావు, ఎపిడాలజిస్టు వాణిశ్రీ, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినిత్ జి.గొల్లపల్లెను సందర్శించారు. అతిసారతో బాధ పడుతున్న రోగులను ఆరోగ్యం గురించి ఆరా తీసి భరోసా కల్పించారు. చాలామంది రోగులు నీరసంతో ఉండడంతో సెలైన్ పెట్టుతున్నారు. దోమలు నివారణకు ఫాగింగ్ చేయించారు. పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. తవణంపల్లె మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ కేశవనారాయణ రోగులను పర్యవేక్షిస్తూ వైద్య సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, గోపి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



అతిసార బాధితులకు వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఇక డివిజన్ కేంద్రాల్లోనే ఆ కార్యాలయాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాల పరిధిలో డివిజన్ కేంద్రాల్లోనే డీఎల్‌పీఓ, డ్వామా ఏపీడీ, డీఎల్‌డీఓ కార్యాలయాలను నిర్వహించనున్నారు. గత పాలనలో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి వాటి నిర్వహణ నిమిత్తం డీఎల్‌డీఓ విభాగాన్ని ప్రవేశపెట్టారు. డీఎల్‌డీఓలుగా సీనియర్ ఎంపీడీఓలకు ఉద్యోగోన్నతి కల్పించి, సీపీఓ పర్యవేక్షణలో వారు విధులు నిర్వహించేవారు. ఇక పంచాయతీల పరంగా డీఎల్‌పీఓ, డ్వామా ఏపీడీ, డీఎల్‌డీఓ విభాగాలన్నీ ఒకే కార్యాలయంలోకి తీసుకురానున్నారు. అవసరమైన సిబ్బందిని జెడ్పీ నుంచి డిప్యూటేషన్ విధానంలో ఇవ్వనున్నారు. సంబంధిత కార్యాలయాలను ఆధునీకరణకు నిధులు సైతం మంజూరు చేశారు. ఆ పనులను టీడీపీ నాయకులకు అందించారు. పనులు పూర్తి అయిన తరువాత అక్టోబర్ 2 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఈ ప్రాంతాల్లో కార్యాలయాల్లో..

చిత్తూరు, కుప్పం, నగరిలో ఇదివరకే ఉన్న డీఎల్‌డీఓ కార్యాలయాలు, పలమనేరులో స్త్రీ శక్తి భవనం, తిరుపతిలో జెడ్పీ గెస్ట్‌హౌస్, శ్రీకాళహస్తి, మదనపల్లెలో డీఎల్‌డీఓ కార్యాలయాల నుంచి ఇక పాలన సాగించనున్నారు. ఇందుకోసం జెడ్పీ నుంచి సిబ్బందిని సర్దుబాటు చేయనున్నారు. కార్యాలయాల ఆధునీకరణకు మండల, జెడ్పీ నిధులు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల నిధులు ఖర్చు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు సగానికి పైగా డివిజన్లలో డీఎల్‌పీఓ(డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోవడంతో డీపీఓలకు పనిభారం తప్పడం లేదు. దీంతో తూతూమంత్రంగా ఇన్‌చార్జ్‌లుగా అదనపు బాధ్యతలను డీఎల్‌పీఓ(డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)కు అప్పగించారు. నిత్యం వీరికి కలెక్టరేట్‌లో జరిగే సమావేశాలకే సమయం సరిపోతుంది. గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులు, క్షేత్రస్థాయిలో సచివాలయాల పరిధిలో జరిగే పలు సర్వేల రిపోర్టును ఇవ్వడానికే సమయం సరిపోతుంది. దీనికితోడు అదనంగా డీఎల్‌పీఓ బాధ్యతలు ఇస్తే, ఆ బాధ్యతల నిర్వహణ నామమాత్రంగానే కనిపిస్తోంది.

వరసిద్ధుడి సేవలో ఆర్టీఐ కమిషనర్



సునీల్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ చావలి సునీల్ దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఈయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్ దర్శన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితుల ఆశీర్వచనాలు, ప్రసాదం, స్వామిచిత్రపటం అంజేశారు. కార్యక్రమంలో డీఈఓ సాగర్‌బాబు తదితరులు ఉన్నారు.

కొటేషన్లు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేట దుర్గాంబ దేవస్థానంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి జరిగే దసరా బ్రహ్మోత్సవాల్లో పలు నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ తిమ్మారెడ్డి తెలిపారు. అమ్మవారి అలంకరణ, పందిళ్లు, విద్యుత్ అలంకరణ, పుష్పాలంకరణ, మోత కూలీలు, వంట కూలీలు, వంట పాత్రలు, అన్నప్రసాద సామగ్రి తదితర వాటికి కొటేషన్లు వేయవచ్చన్నారు. వచ్చేనెల 10వ తేదీ లోపు ఈ కొటేషన్లను దేవస్థాన ఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

మహిళలపై పెరిగిన దాడులు



పచ్చమూకల దాడిలో గాయపడిన బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు

పలమనేరు: గంగవరం మండల వైఎస్సార్ సీపీ బీసీ మహిళా అధ్యక్ష్యురాలిపై పచ్చమూకల దాడి అమానుషమని ఆ పార్టీ జిల్లా నాయకురాలు జమీలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం పలమనేరు నియోజకవర్గ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లతో కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై పచ్చమూకల దాడులు పెరిగాయని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం ఏదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని, కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకురాళ్లు పుష్ప, ఉషా, నౌజియా, బద్రూన్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వైరల్ ఫీవర్ సర్వే

ఐరాల: పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో వైరల్ జ్వరాలు, అతిసారం(డయేరియా) సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. శనివారం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వైరల్ జ్వరాలు, అతిసారం ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ నీటిని వేడి చేసి తాగాలన్నారు. దోమల నివారణకు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వైరల్ ఫీవర్ వచ్చే ప్రాంతాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా నివారించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. సాధారణ కంటే జ్వరాలు, అతిసారం కేసులు ఏ ప్రాంతంలో అయినా అధికమైతే వెంటనే సమాచారం పంపాలన్నారు. వైరల్ జ్వరాలు సోకితే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో రక్తపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి కలుషితం కారణంగా వచ్చే అతిసార వ్యాధులపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించే వైద్య సిబ్బంది ఓఆర్‌ఎస్ ద్రావణం, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బెస్తపల్లెలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి రూ.1 లక్ష విరాళం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆ కళాశాల పూర్వ విద్యార్థులు రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆ కళాశాలలో 1969–71 సంవత్సరాల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు (ఇంటర్ నుంచి డిగ్రీ కళాశాలగా మారింది) చదివిన విద్యార్థులు శనివారం కళాశాలలో సమావేశమయ్యారు. తాము చదువుకున్న పీవీకేఎన్ కళాశాలలో గ్రంథాలయ అభివృద్ధికి తమ వంతు సాయంగా రూ.1 లక్ష విరాళాన్ని ప్రిన్సిపల్ డా.జీవన జ్యోతికి అందజేశారు. తమ ఉన్నత విద్యకు బాటలు వేసిన కళాశాలకు తిరిగి సేవలందించే అవకాశం దక్కడం గర్వకారణమని పూర్వ విద్యార్థులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ పీవీకేఎన్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సహకారం ఎల్లప్పుడూ కళాశాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. దాతలు అందజేసిన రూ.1 లక్ష ఆర్థిక సహాయంతో కళాశాలలో డిజిటల్ లైబ్రరీ కేబిన్, పీరియాడికల్ స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల ఏక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.హరి ప్రసాద్, అధ్యాపకులు గోపినాయక్, డా.చెన్నకేశవులు, కుసుమకుమారి పాల్గొన్నారు.



పీవీకేఎన్ కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపల్‌తో చర్చిస్తున్న పూర్వవిద్యార్థులు

అమ్మో.. పాములు!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రి మెయిన్ డ్రగ్స్ గదిలో పాములు బుసకొడుతున్నాయి. ఇక్కడ నెల రోజుల వ్యవధిలో మూడు పాములు ప్రత్యక్షమయ్యాయి. అందులో రెండు పాములును పట్టించారు. మరో పెద్ద పాము ప్రత్యక్షమై మాయమవుతోంది. సిబ్బంది, అధికారుల ముందే బుస్సలు కొడుతూ భయపెడుతోంది. పాముల భయంతో రెండు మూడు గదుల్లోకి వెళ్లలేకపోతున్నారు. మరో గదికి తాళం వేసేశారు. డ్రగ్స్ బాక్సులను కదలించాలంటే వణికిపోతున్నారు. డ్రగ్స్‌గది వెనుక భాగంలో చెత్తాచెదారంతో నిండిపోయిందని, అక్కడి నుంచి చిన్నచిన్న రంధ్రాల ద్వారా పాములు లోపలికి వచ్చేస్తున్నాయని డ్రగ్స్ బృందం చెబుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది.



డ్రగ్స్‌స్టోర్‌లోని బాత్‌రూంలో పట్టుకున్న పామును చూపుతున్న స్నేక్ క్యాచర్

భళా.. నృత్యం



కాణిపాకం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవస్థానంలోని ఆస్థాన మండపంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం ప్రవచనాలు, భక్తరంజని, మధ్యాహ్నం హరికథ కాలక్షేపం, భక్తీగీతాలు అలరించాయి. సాయంత్రం కూచిపూడి, భరతనాట్యం భళా అనిపించాయి. రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఆహుతులను కట్టుకున్నాయి. కోలాటాలు, భజనలతో ఆలయ ఆవరణం సందడిగా కనిపించింది. అనంతరం అధికారులు కళాకారులకు ప్రశాంసపత్రం అందజేశారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు